చిత్రలేఖనంలో బంగారు తల్లులు

ప్రతిభ కనబరుస్తున్న గాజువాక జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు

గత విద్యానంవత్సరంలో 200కు పైగా పసిడి పతకాలు

చిత్రలేఖనంలో గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థినులు ప్రతిభ కనబరుస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో బహుమతులను సొంతం చేసుకొని అందరి మన్ననలను అందుకుంటున్నారు. డ్రాయింగ్ టీచర్ భావనారుషి ఆధ్వర్యంలో చిన్నారులు తర్ఫీదు పొందుతూ ఎక్కడ పోటీలు జరిగినా సత్తా చాటుతున్నారు. జిల్లా, జోనల్, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. గత విద్యా సంవత్సరంలో నిర్వహించిన వివిధ పోటీల్లో ఈ పాఠశాల విద్యార్థినులు 200కు పైగా బంగారు పతకాలు, 45కు పైగా రజత పతకాలు, 40 కాంస్య పతకాలను సాధించి, పాఠశాలకు పేరు తెచ్చారు.

–గాజువాక

మా స్టూడెంట్స్ పాల్గొంటే.. పతకమే



విద్యార్థినులు ప్రతిరోజు అరగంటపాటు చిత్రలేఖనంలో సాధన చేస్తున్నారు. బొమ్మలు ఎలా గీయాలి, ఎలాంటి బొమ్మలు ఆకర్షణీయంగా ఉంటాయి, ఏ బొమ్మకు ఏయే రంగులు వేయాలి వంటి విషయాలపై సూచనలు చేస్తుంటాను. విద్యార్థుల్లో ఉన్న ఆసక్తిని గమనించి వారిని ప్రోత్సహిస్తూ పోటీలకు పంపిస్తాను. వెళ్లిన ప్రతి పోటీలోను మా విద్యార్థులు స్వర్ణ పతకాలను కచ్చితంగా తీసుకొచ్చారు.

– భావనారుషి, చిత్రలేఖన ఉపాధ్యాయుడు

ఇందు.. బంగారు పతకాల విందు



గాజువాక హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి విద్యార్థిని ఇందు చిత్రలేఖనంలో మూడు బంగారు పతకాలను సాధించింది. ముంబైకు చెందిన రంగోత్సవ్ సెలబ్రేషన్స్‌లో జాతీయ స్థాయి చిత్రలేఖనంలో, హైదరాబాద్‌కు చెందిన ప్రతాప్ ఆర్ట్ అకాడమీ నిర్వహించిన జాతీయ చిత్రలేఖనంలో, హైదరాబాద్‌లో నిర్వహించిన ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ అంతర్జాతీయ పోటీల్లో స్వర్ణ పతకాలను సొంతం చేసుకుంది.

'సువర్ణ' హాసిని



తొమ్మిదో తరగతి విద్యార్థిని పి.హాసిని పేదింటి బిడ్డ. తండ్రి సెలూన్ నడుపుతున్నారు. ఆమె జాతీయ స్థాయి చిత్రలేఖనంలో మూడు స్వర్ణ పతకాలను సాధించింది. విజయవాడకు చెందిన డ్రీమ్ ఆర్ట్ అకాడమీ నిర్వహించిన జాతీయ స్థాయి చిత్రలేఖనంలో, ముంబైకు చెందిన రంగోత్సవ్ సెలబ్రేషన్స్‌లో జాతీయ స్థాయి చిత్రలేఖనంలో, హైదరాబాద్‌లో నిర్వహించిన ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ అంతర్జాతీయ పోటీల్లో స్వర్ణ పతకాలను సాధించింది.

భవ్య.. బెస్ట్



ఏడో తరగతి విద్యార్థిని సీహెచ్.భవ్యశ్రీ చిత్రలేఖనంలో అత్యంత ప్రతిభ చూపుతోంది. తండ్రి ఆటో డ్రైవర్. ముంబైకు చెందిన రంగోత్సవ్ సెలబ్రేషన్స్‌లో జాతీయ స్థాయి చిత్రలేఖనంలోను, హైదరాబాద్‌కు చెందిన ప్రతాప్ ఆర్ట్ అకాడమీ నిర్వహించిన జాతీయ చిత్రలేఖనంలోను, నెల్లూరుకు చెందిన అమీర్ ఆర్ట్ అకాడమీ నిర్వహించిన జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీల్లోను, హైదరాబాద్‌లో నిర్వహించిన ఆజాదికా అమృత్ మహోత్సవ్ అంతర్జాతీయ పోటీల్లోను, విజయవాడకు చెందిన డ్రీమ్ ఆర్ట్ అకాడమీ నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లోను స్వర్ణ పతకాలను సాధించిన భవ్యశ్రీ విశాఖలో నిర్వహించిన జిల్లా స్థాయి బాలోత్సవ్ పోటీల్లో జిల్లా ప్రథమ స్థానాన్ని పొందడంతోపాటు విశాఖలో అక్షయ పాత్ర ఫౌండేషన్ నిర్వహించిన చిత్రలేఖనంలో బెస్ట్ ఆర్టిస్ట్ అవార్డును సొంతం చేసుకుంది.

పసిడి కాంతుల 'తేజస్విని'



ఏడో తరగతి విద్యార్థిని తేజస్విని ఎలక్ట్రీషియన్ కుమార్తె. గత విద్యా సంవత్సరంలో రెండు స్వర్ణ పతకాలను సాధించింది. నెల్లూరుకు చెందిన అమీర్ ఆర్ట్ అకాడమీ నిర్వహించిన జాతీయ స్థాయి చిత్రలేఖన పోటీల్లోను, విజయవాడకు చెందిన డ్రీమ్ ఆర్ట్ అకాడమీ నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లోను స్వర్ణ పతకాలను సాధించి పలువురి మన్ననలను పొందింది.

నీతూ అక్షయకు ఐదు స్వర్ణాలు



పేదింటికి చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని వై.నీతూ అక్షయ ఐదు బంగారు పతకాలను సాధించి తోటి విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచింది. హైదరాబాద్‌కు చెందిన ప్రతాప్ ఆర్ట్ అకాడమీ నిర్వహించిన జాతీయ చిత్రలేఖనంలోను, హైదరాబాద్‌లో నిర్వహించిన ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ అంతర్జాతీయ పోటీల్లో, విశాఖలో నిర్వహించిన జిల్లా స్థాయి బాలోత్సవ్ పోటీల్లో, విజయవాడకు చెందిన డ్రీమ్ ఆర్ట్ అకాడమీ నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో, ముంబైకు చెందిన రంగోత్సవ్ సెలబ్రేషన్స్‌లో జాతీయ స్థాయి చిత్రలేఖనంలో పసిడి పతకాలను సొంతం చేసుకుంది.

ఆటోడ్రైవర్ కుమార్తె .. అదుర్స్



ఆటో డ్రైవర్ కుమార్తె, తొమ్మిదో తరగతి విద్యార్థిని రమాదేవి చిత్రలేఖనంలో రాణిస్తోంది. హైదరాబాద్‌కు చెందిన ప్రతాప్ ఆర్ట్ అకాడమీ నిర్వహించిన జాతీయ చిత్రలేఖనంలో, హైదరాబాద్‌లో నిర్వహించిన ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ అంతర్జాతీయ పోటీల్లో, చోడవరంలో సూర్యనారాయణ ఆర్ట్ అకాడమీ నిర్వహించిన జాతీయ స్థాయి చిత్రలేఖనంలో, విజయవాడకు చెందిన డ్రీమ్ ఆర్ట్ అకాడమీ నిర్వహించిన జాతీయ స్థాయి చిత్రలేఖనంలో బంగారు పతకాలను సాధించింది. భవిష్యత్‌లో చిత్రలేఖన ఉపాధ్యాయినిగా ఎదగాలన్నది తన కోరిక అని చెబుతోంది.

పెయింటర్ కుమార్తె ప్రతిభ



పెయింటర్ కుమార్తె, ఏడో తరగతి విద్యార్థిని టి.మౌనిక చిత్రలేఖనంలో ప్రతిభ ప్రదర్శిస్తోంది. బంగారు పతకాలతో పాటు నగదు బహుమతులను సైతం సొంతం చేసుకుంటోంది. విజయవాడకు చెందిన డ్రీమ్ ఆర్ట్ అకాడమీ నిర్వహించిన జాతీయ స్థాయి చిత్రలేఖనంలో, విశాఖలో నిర్వహించిన జిల్లా స్థాయి బాలోత్సవ్ పోటీల్లో బంగారు పతకాలను సాధించిన మౌనిక పరవాడలోని ఎన్‌టీపీసీలో నిర్వహించిన జిల్లా స్థాయిలో చిత్రలేఖనం పోటీల్లో అవార్డుతో పాటు రూ.2వేల నగదు ప్రోత్సాహకాన్ని కూడా సొంతం చేసుకుంది.

'స్వర్ణ' నికీషా



పేద కుటుంబానికి చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థిని వై.నికీషా చిత్రలేఖనంలో మూడు స్వర్ణ పతకాలను సాధించింది. హైదరాబాద్‌కు చెందిన ప్రతాప్ ఆర్ట్ అకాడమీ నిర్వహించిన జాతీయ చిత్రలేఖనంలో, హైదరాబాద్‌లో నిర్వహించిన ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ అంతర్జాతీయ పోటీల్లో, విశాఖలో నిర్వహించిన జిల్లా స్థాయి బాలోత్సవ్ పోటీల్లో బంగారు పతకాలను సాధించింది.

మెరిసిన మోక్షేశ్వరి



హెల్త్ అడ్వయిజర్ కుమార్తె, ఆరో తరగతి విద్యార్థిని ఎం.మోక్షేశ్వరి చిత్రలేఖనంలో ఇప్పుడిప్పుడే రాణిస్తోంది. ముంబైకు చెందిన రంగోత్సవ్ సెలబ్రేషన్స్‌లో జాతీయ స్థాయి చిత్రలేఖనంలో బంగారు పతకాన్ని సాధించిన చిన్నారి విశాఖలో నిర్వహించిన జిల్లా స్థాయి బాలోత్సవ్ పోటీల్లోను, పాఠశాలలో నిర్వహించిన చిత్రలేఖనంలోను పలు అవార్డులను సాధించింది.

హిమశ్రీ.. సూపర్



ఎలక్ట్రీషియన్ కుమార్తె, ఏడో తరగతి విద్యార్థిని జె.హిమశ్రీ చిత్రలేఖనంలో అద్భుతాలను ప్రదర్శిస్తోంది. చిన్న వయస్సులోనే మూడు బంగారు పతకాలను సాధించింది. హైదరాబాద్‌కు చెందిన ప్రతాప్ ఆర్ట్ అకాడమీ నిర్వహించిన జాతీయ చిత్రలేఖనంలో, నెల్లూరుకు చెందిన అమీర్ ఆర్ట్ అకాడమీ నిర్వహించిన జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీల్లో, విజయవాడకు చెందిన డ్రీమ్ ఆర్ట్ అకాడమీ నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లోను స్వర్ణ పతకాలను సాధించింది.

క్లుప్తంగా

కరెంటు చార్జీల పెంపుపై సీపీఎం ధర్నా నేడు

ఉక్కునగరం: టౌన్‌షిప్‌లో నివశిస్తున్న కార్మికుల క్వార్టర్లలో విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేపట్టనున్నారు. ఉక్కు టౌన్ అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ వద్ద మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్మికులు తమ కుటుంబ సభ్యులతో ధర్నాలో పాల్గొనున్నారు. కార్మికులందరూ హాజరై యాజమాన్యం వైఖరిని నిరసించాలని సీపీఎం నాయకులు కోరారు.

మూగ జీవుల కోసం నీళ్ల కుండీల ఏర్పాటు

- బాలవికాస్ చిన్నారుల సేవానిరతి



నీళ్ల కుండీల వద్ద మూగ జీవులు

ఉక్కునగరం: స్థానిక సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మూగ జీవుల కోసం నీళ్ల కుండీలు ఏర్పాటు చేశారు. సత్యసాయి సమితికి చెందిన బాలవికాస్ చిన్నారుల ఆధ్వర్యంలో కుండీలు నిర్మించారు. వేసవిలో మూగ జీవులు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతుండటం గమనించిన విద్యార్థులు సత్యసాయి సేవా మందిరం పరిసర ప్రాంతాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి, ఆ ప్రాంతాన్ని శుభ్రం చేశారు. కుండీలు ఏర్పాటు చేసి, అందులో నీటిని అందుబాటులో ఉంచారు. మూగ జీవుల పట్ల చిన్నారులకు ఉన్న ప్రేమను సమితి కన్వీనర్ జి.రామకృష్ణ అభినందించారు.

పుస్తక పఠనంపై ఆసక్తి అవసరం



పుస్తక పఠనంలో నిమగ్నమైన చిన్నారులు

పెదగంట్యాడ: విద్యార్థులు పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలని గ్రంథాలయాధికారి పి.వి. రమణ సూచించారు. పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థులకు పుస్తక పఠనంపై శిక్షణ ఇచ్చారు. కథలు చెప్పారు. విద్యార్థులతో గ్రంథ పఠనం చేయించారు. వారి సందేహాలను నివృత్తి చేశారు.

మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు



వాహన చోదకుడికి డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేస్తున్న ఎస్‌ఐ అప్పారావు

మల్కాపురం: మద్యం తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు తప్పవని మల్కాపురం ట్రాఫిక్ ఎస్‌ఐ జి.అప్పారావు హెచ్చరించారు. సిబ్బందితో కలిసి ఆదివారం ఉదయం, సాయంత్రం మల్కాపురం, శ్రీహరిపురం, కోరమండల్, సింధియా మొదలగు ప్రధాన కూడళ్లలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ద్విచక్ర, భారీ వాహనాల చోదకులకు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేశారు. ముందుగా శ్రీహరిపురం వద్ద నిర్వహించిన తనిఖీల్లో ఎస్‌ఐ మాట్లాడుతూ నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు స్టేషన్ పరిధిలోని పలు ముఖ్య కూడళ్లలో రెండు రోజులుగా వాహనాలను తనిఖీ చేస్తున్నామని తెలిపారు. మద్యం తాగి వాహనం నడిపిన వారు, ద్విచక్ర వాహనాలు నడిపిన మైనర్లు, ట్రిబుల్ డ్రైవింగ్, అతి వేగంగా వాహనాల నడిపిన వారిని పట్టుకుని వారి పత్రాలను పరిశీలించి, చోదకులపై చర్యలు తీసుకున్నామని వివరించారు.

నేత్రపర్వంగా తిరువీధి ఉత్సవం



ఊరేగింపులో పూజలందుకుంటున్న బంగారుమాంబ అమ్మవారు



తిరువీధి ఉత్సవంలో ఆకట్టుకున్న తీన్‌మార్ బ్యాండ్

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు నాతయ్యపాలెంలో బంగారుమాంబ, నూకాంబిక, దుర్గాలమ్మ వార్ల నవరాత్రి పండగ మహోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి ముగ్గురమ్మల ఉత్సవ విగ్రహాలను పూలమాలలతో అలంకరించి, గ్రామంలో తిరువీధి ఉత్సవం నిర్వహించారు. ప్రతీ ఇంటి నుంచి మహిళలు బిందెలతో నీళ్లు తెచ్చి విగ్రహం వద్ద అమ్మవార్లకు చల్లదనం చేశారు. ఊరేగింపులో తీన్‌మార్ బృందం బ్యాండ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



నిత్యకల్యాణంలో కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేసి 108 స్వర్ణ పుష్పాలతో అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. అర్చకుడు అప్పాజీ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపరింటెండెంట్ పిల్లా శ్రీనివాసరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణమండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

ఉక్కు అథ్లెట్ భాస్కరరావుకు పతకాలు



పెదగంట్యాడ: పాన్ ఇండియా జాతీయ స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్–2024 పోటీల్లో ఉక్కు అథ్లెట్ ఎం.భాస్కరరావు సత్తా చాటారు. ఆయన రెండు పోటీలలో పాల్గొని రజత పతకాలు సాధించారు. ఈ నెల 22 నుంచి 24 వరకు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో జాతీయ స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్–2024 పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విశాఖ స్టీల్‌ప్లాంట్ నీటి సరఫరా విభాగంలో పని చేస్తున్న భాస్కరరావు పాల్గొన్నారు. 55 ప్లస్ వయసు విభాగంలో షాట్‌పుట్‌లో 5 కిలోల గుండును 10.18 మీటర్లు విసిరి రజత పతకాన్ని కైవసం చేసుకున్నారు. అలాగే డిస్కస్ త్రోలో 25.84 మీటర్ల దూరం విసిరి రజత పతకాన్ని సాధించారు. ఈ రెండు పోటీల్లో విజయం సాధించిన భాస్కరరావుకు పాన్ ఇండియా జనరల్ సెక్రటరీ డీఏ నటరాజ్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ మేరకు భాస్కరరావును మాజీ మేయర్ పులుసు జనార్ధనరావు, ఉక్కు అధికారులు అభినందించారు.

దువ్వాడ స్టేషన్ మాస్టారుకు సత్కారం



స్టేషన్ మాస్టారు రామకృష్ణారావును సత్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా కనీస సౌకర్యాలు కల్పించడంలో స్టేషన్ మాస్టర్ ఎన్.ఆర్.కె.రావు ప్రత్యేక చొరవ తీసుకున్నారని దువ్వాడ రైల్వే స్టేషన్ యూజర్స్ అసోసియేషన్ కార్యదర్శి కంచుమూర్తి ఈశ్వర్ అన్నారు. ఈ నెలాఖరున పదవీ విరమణ చేయనున్న రామకృష్ణారావును కూర్మన్నపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో అసోసియేషన్ ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల మన్ననలు పొందిన రామకృష్ణా రావు సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు వి.జాషువా, ఉపాధ్యక్షుడు రామకృష్ణ, కోశాధికారి కె.వీర్రాజు, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు కృషి

సీతంపేట: సమాజంలో నానాటికీ పెరిగిపోతున్న గుణ హీనత, కుసంస్కారంతో హిందూ సమాజం కుచించుకుపోయి సంకుచితమవుతోందని భువనేశ్వరి పీఠాధిపతి కమలానంద భారతి స్వామి అన్నారు. స్థానిక శంకరమఠంలో 'దేవాలయం కేంద్రంగా ధార్మిక, సామాజిక కార్యక్రమ నిర్వహణ' అంశంపై ఆదివారం ఆయన ప్రసంగించారు. దేవాలయంలో దేవుడి ఎదుట కూర్చుని ఈ విషయాలపై చర్చించాలన్నారు. ప్రతి దేవాలయంలో హిందూ ధర్మ జాగరణ, హిందూ ధర్మ ప్రచారం, హిందూ ధర్మ రక్షణ జరగాలని, దీనికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని పిలుపునిచ్చారు.

అలరించిన సినీ గీతాలాపన పోటీ



సినీ గీతాలు ఆలపిస్తున్న గాయనీ గాయకులు

మల్కాపురం: స్థానిక వేదిక వద్ద ఆదివారం పిల్లనగ్రోవి పిలుపు పేరిట నిర్వహించిన సినీ సంగీత పాటల పోటీ అలరించింది. తెలుగు, హిందీ చిత్రాల్లోని పలు పాటలను కళాకారులు పాడి ఆహుతులను అలరించారు. గాయకులు ఉరుకూటి బాబూరావు యాదవ్, నూనెల పైడిరాజు యాదవ్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అనకాపల్లి, అరకు, పాడేరు, గాజువాక, మల్కాపురం తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో గాయకులు పాల్గొని వారు ఎంచుకున్న పాటలను పాడి ప్రేక్షకులను అలరించారు. ఒక్కో గాయకుడికి మూడు పాటల చొప్పున పోటీ జరిగింది. అనంతరం జంటగా పాటల పోటీ నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. పోటీలో పాల్గొన్న గాయనీ, గాయకులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలను అందించారు.

యాత, శెట్టిబలిజ సంఘం కార్యవర్గం ఎన్నిక



యాత, శెట్టిబలిజ సంఘం నూతన కార్యవర్గం

పెదగంట్యాడ: యాత, శెట్టిబలిజ, గౌడ, ఈడిగ, శ్రీశయన సామాజిక వర్గాలకు చెందిన వారికి తన పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని సంఘం నూతన అధ్యక్షుడు చెల్లుబోయిన నాయుడు అన్నారు. సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. గాజువాకలోని ఓ హోటల్‌తో కొత్త కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో అధ్యక్ష పదవికి ఎంపిక చేసిన సభ్యులకు రుణపడి ఉంటానన్నారు. ఆరేళ్ల తర్వాత కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకున్నామని, సంఘాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. గాజువాక నియోజకవర్గంలో తమ సామాజికవర్గానికి చెందిన వారు సుమారు 50వేల మంది వరకూ ఉన్నారని, అందరినీ ఒక తాటిపైకి తీసుకువస్తామన్నారు. అన్ని రంగాల్లోనూ తమ సామాజికవర్గానికి పెద్ద పీట వేసేలా కృషి చేస్తానన్నారు. కార్యదర్శిగా వనము నాగేశ్వరరావు, కోశాధికారిగా ఎలమంచిలి మంగరాజును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బత్తిన పరదేశి, నెల్లి సాధూరావు, అండిబోయిన అప్పారావు, సిరట్ల వాసు, సప్పిడి నాగరాజు, అండిబోయిన పెద్ద నూకరాజు, పీత వెంకటరమణ, దుంగా దేవనరాజు, నెల్లి అప్పలరాజు, పూడి రమణ, నడిగట్ల గురుమూర్తి, సారిపిల్లి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

యారాడ బీచ్‌ను శుభ్రపరిచిన యువత, విద్యార్థులు



యారాడ బీచ్ క్లీనింగ్‌లో పాల్గొన్న యువత, విద్యార్థులతో సీఐ దాలిబాబు

మల్కాపురం: యారాడ హెల్పింగ్ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం యారాడ బీచ్ తీరంలో పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. స్థానిక జేపీ, ప్రైవేట్ స్కూళ్లకు చెందిన విద్యార్థులు, యువత తీరంలోని వ్యర్థాలను తొలగించి పారిశుధ్య వ్యర్థాలను తరలించే వ్యాన్‌కు అందించారు. కార్యక్రమంలో పాల్గొన్న సీఐ దాలిబాబు మాట్లాడుతూ బీచ్‌ను శుభ్రం చేసిన విద్యార్థులు, యువతను అభినందించి, సర్టిఫికెట్లు అందించారు. యారాడ హెల్పింగ్ యూత్ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.